సాక్షి జగిత్యాల

గురువారం । 13 । జూలై । 2023



కుల గణన చేపట్టాలని వినతి

జగిత్యాల: బీసీ కుల జనగణన చేపట్టాలని జీఎస్పీ నాయకులు కోరారు. బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



పథకాలపై ప్రచారం

ధర్మపురి: పథకాలను గడపగడపకూ చేరవే యాలని డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో అన్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
29.0/240.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. జిల్లాలోని పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భరణి నక్షత్ర వేడుకలు



ధర్మపురి: స్థానిక శ్రీయమధర్మరాజు ఆలయంలో బుధవారం భరణి నక్షత్రం సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితుడు బొజ్జ ముత్యాలశర్మ మంత్రోచ్చారణలతో రుద్రాభిషేకం తదితర అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో దేవస్థానం రేనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిహారం సద్వినియోగం చేసుకోండి

జగిత్యాల: పరిహారం కింద అందిన సొమ్మును తమ అవసరాలకు వినియోగించుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. జీవనోపాధి నిమిత్తం సౌదీ అరేబియాకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన వొజ్జల శ్రీనివాస్ కుటుంబానికి అక్కడి ఎంబసీ ఆఫ్ ఇండియా రూ.8,65,326 పరిహారం మంజూరు చేసింది. ఈ సొమ్ముకు సంబంధించిన చెక్కును కలెక్టరేట్‌లో మృతుడి భార్య వొజ్జల పద్మకు బుధవారం కలెక్టర్ అందజేశారు. అనంతరం మాట్లాడారు. ధర్మపురికి చెందిన శ్రీనివాస్ ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లి దుర్మరణం చెందారని పేర్కొన్నారు.

'మోసం చేస్తే సహించేదిలేదు'



జగిత్యాలటౌన్: డిక్లరేషన్ల పేరిట బీసీలను మోసం చేయాలని చూస్తే సహించేది లేదని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ హెచ్చరించారు. బీసీ ప్లీనరీ ప్రచార పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మరో నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించేందుకు ఈనెల 15న హైదరాబాద్‌లో బీసీల రాజకీయ ప్లీనరీ నిర్వహిస్తామని ఆయన చెప్పారు. జనాభా దామాషా పద్ధతిన టికెట్లు కేటాయిస్తామని ప్రకటించకుండా బీసీ డిక్లరేషన్ పేరిట మరోసారి మోసం చేస్తే ఈసారి ఊరుకునేది లేదన్నారు. రాయితీలతో రాజీపడకుండా సీఎం కుర్చీ సాధించడం లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గాజుల నాగరాజు, ఎన్నం ప్రకాశ్, బ్రహ్మాండభేరి నరేశ్, భూమి రమణ, మొగులోజి విజయ, నారోజు రాకేశ్, మాచర్ల అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

జగిత్యాలక్రైం: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ భాస్కర్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాల డీసీఆర్బీలో పనిచేస్తున్న గౌతమ్‌ను బీర్‌పూర్ ఎస్సైగా బదిలీ చేశారు. ఐటీ కోర్‌లో పనిచేస్తున్న సందీప్‌ను జగిత్యాల డీసీఆర్బీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఉత్తుత్తి 'పొదుపు' సంఘాలు

- మహిళలకు తెలియకుండానే ఏర్పాటు
- నకిలీ తీర్మానాలతో బ్యాంకుల్లో దరఖాస్తు
- విచారణ చేయకుండానే రుణాల మంజూరు
- ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి..
- విచారణ వేగవంతం చేసిన పోలీసులు
- కోరుట్ల మెప్మా పరిధిలో అవినీతి బాగోతం!



ఇది ఒక ఉత్తుత్తి మహిళా పొదుపు సంఘం. వివిధ సంఘాల్లోని కొందరు మహిళల పాన్, ఆధార్ జిరాక్స్‌లు సేకరించి తయారు చేసిన సెల్ఫ్‌హెల్ప్ ఐడీ కార్డు. దీనిని చూపించి, నకిలీ తీర్మానం కాపీ జతచేసి ఓ బ్యాంకు నుంచి రూ.9లక్షల రుణం పొందారు. దీనిపేరు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో నమోదు కాలేదు. ఆన్‌లైన్ కోడ్ కేటాయించలేదు. మైక్రో క్రెడిట్ ప్లాన్ అప్రూవల్ అసలే లేదు. అయినా, బ్యాంకర్లు అప్పనంగా లోన్ మంజూరు చేసేశారు.

కోరుట్ల: జిల్లాలోని కొందరు మహిళా సంఘాల ఆర్పీలు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. రుణ వాయిదాలను బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలని మహిళా సభ్యులు ఇచ్చిన డబ్బులు నొక్కేస్తున్నారు. మరికొందరు ఏకంగా నకిలీ మహిళా సంఘాలను సృష్టించి రుణాలు తీసుకుంటున్నారు. రంగంలోకి దిగుతున్న అధికారులు.. 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు'.. విచారణ జరిపి బాధ్యులను గుర్తిస్తున్నారు.. రికవరీ కోసం నోటీసులు జారీచేస్తున్నారు.. అంతకుమించి ముందుకు సాగడం లేదనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.

అసలేం జరుగుతోంది..

- ఆర్నెల్ల క్రితం కోరుట్లలోని ఓ ఆర్పీ(రిసోర్స్ పర్సన్) కొన్ని బోగస్ మహిళా సంఘాలను సృష్టించారు. బ్యాంకు, మెప్మా సిబ్బంది సహకారంతో బ్యాంకులో రూ.70లక్షల వరకు రుణాలు పొంది ఆ సొమ్ము దుర్వినియోగం చేశారు. ఇందుకోసం తమ వద్ద ఉన్న మహిళల ఆధార్, పాన్‌కార్డు, ఇతర సర్టిఫికెట్ జిరాక్స్‌లు వినియోగించారు. వారికి తెలియకుండానే బోగస్ సంఘాలు తయారు చేశారు.
- నిబంధనల ప్రకారం.. ఆర్పీలు తమ మహిళా సంఘాలను మెప్మాలో నమోదు చేయాలి. ఇలా నమోదైన సంఘాలకు మెప్మా అధికారులు ఆన్‌లైన్ కోడ్ ఇస్తారు. దీని ఆధారంగానే మహిళా సంఘాలకు గుర్తింపు లభిస్తుంది. వీటికే బ్యాంకుల ద్వారా రుణాలు పొందడానికి అర్హత ఉంటుంది. రుణాలు మంజూరు చేసే సమయంలో మెప్మా నుంచి మైక్రో క్రెడిట్ ప్లాన్ అప్రూవల్ జారీచేస్తూ.. మున్సిపల్ కమిషనర్, మెప్మా ఇన్‌చార్జిలు ధ్రువీకరించాలి.

బ్యాంకుల్లోనూ గోల్‌మాల్..!

- ఆర్నెల్ల క్రితం కోరుట్లలో బోగస్ మహిళా సంఘాల పేరిట రూ.70 లక్షల రుణాలు తీసుకుని దుర్వినియోగం చేశారు.
- ఈ వ్యవహారంలో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లోని రెండు బ్యాంకులు నిబంధనలు పాటించకుండా రుణాలు మంజూరు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- తాజాగా వెలుగులోకి వచ్చిన రుణాల దుర్వినియోగం బ్యాంకు అధికారుల తీరును మరోసారి ప్రశ్నిస్తోంది.
- కోరుట్ల మెప్మా నుంచి రాజేశ్వరి-1 మహిళా పొదుపు సంఘానికి గుర్తింపు, ఆన్‌లైన్‌కోడ్ లేదు. అయినా.. ఒక్కో మహిళా సభ్యురాలి పేరిట రూ.90 వేల చొప్పున పది మందికి రూ.9లక్షల రుణాలను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు గత డిసెంబర్‌లో మంజూరు చేశారని తెలిసింది.
- దీనికి మున్సిపల్ మైక్రో క్రెడిట్ ప్లాన్ అప్రూవల్ లేదు. మెప్మా టీఎంసీ(టౌన్ మిషన్ కో ఆర్డినేటర్) కమిషనర్ నుంచి ధ్రువీకరణ పత్రాలు లేవని అంటున్నారు.
- నిబంధనల ప్రకారం నేరుగా మహిళా సంఘాల సభ్యులకు డబ్బులు ఇవ్వరాదు. వారి బ్యాంకు ఖాతాల్లోనే సొమ్ము జమచేయాలి.
- ఇవన్నీ పక్కనపెట్టి బోగస్ మహిళా సంఘాలకు తీర్మానపత్రం ఆధారంగా రుణాలు ఎలా మంజూరు చేశారో తెలియడం లేదని కోరుట్ల మున్సిపల్‌లోని మెప్మా విభాగం ఇన్‌చార్జి సంధ్యారాణి తెలిపారు.
- వివిధ బ్యాంకుల్లోని సిబ్బంది, అధికారులు ఆర్పీలతో కుమ్మక్కై అడ్డగోలుగా రుణాలు మంజూరు చేయిస్తున్నారనే అనుమానాలు బలపడుతున్నాయి.
- గతంలో ఈ బ్యాంకులో కొన్ని మహిళా సంఘాల రుణాల నిధులు దుర్వినియోగం అయిన విషయం తెలిసిందే.
- బ్యాంకు అధికారులు, సిబ్బంది పాత్రపై పోలీసులు పూర్తిస్థాయి విచారణ జరిపితే అక్రమాల వెనకఉన్న పాత్రధారులు వెలుగులోకి వస్తారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మెప్మాకు సంబంధం లేదు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రుణం పొందిన రాజేశ్వరి-1 మహిళా పొదుపు సంఘానికి మాకు ఎలాంటి సంబంధం లేదు. మా పరిధిలోని సంఘాలకు మాత్రమే ఆన్‌లైన్ కోడ్, మైక్రోక్రెడిట్ అప్రూవల్ జారీచేస్తాం. కానీ, రాజేశ్వరి-1 మహిళా పొదుపు సంఘానికి మేం ఎలాంటి అప్రూవల్స్, ఇతర గుర్తింపులు ఇవ్వలేదు.

– సంధ్య, మెప్మా ఇన్‌చార్జి, కోరుట్ల

విచారణ సాగుతోంది

రాజేశ్వరి-1 మహిళా పొదుపు సంఘంలోని సభ్యులకు అక్రమంగా రుణాలు మంజూరు చేశారంటూ వారం క్రితం మాకు ఫిర్యాదు అందింది. బ్యాంకులోని ఆర్‌ఐసీ విభాగం ఈ ఘటనపై విచారణ జరుపుతోంది. ఆ ప్రక్రియ పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తాం.

– శ్రీకాంత్, రిలేషన్ మేనేజర్, హెచ్‌డీఎఫ్‌సీ, కోరుట్ల

ఆధారాలు సేకరిస్తాం



తనకు తెలియకుండా ఓ మహిళా పొదుపు సంఘంలో తనను సభ్యురాలిగా చేర్చి, తన పేరిట రుణం తీసుకున్నారని చిట్యాల సుకన్య ఇటీవల మాకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై లోతుగా విచారణ చేస్తున్నాం. పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించాక బాధ్యులపై కేసు నమోదు చేస్తాం.

– కిరణ్, ఎస్సై, కోరుట్ల

నృసింహుని దర్శనం మహాభాగ్యం

- ప్రపంచ క్రీడాకారిణి నైనా జైస్వాల్



ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శనం చేసుకోవడం మహాభాగ్యమని ప్రపంచ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ అన్నారు. జైస్వాల్ దంపతులు బుధవారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు సంప్రదాయరీతిలో వారికి ఘనస్వాగతం పలికారు. ప్రధాన, అనుబంధ ఆలయల్లో ప్రత్యేకపూజలు చేసిన జైస్వాల్.. నృసింహుని దర్శించుకోవాలనే తన ఆకాంక్ష ఈరోజు నెరవేరిందన్నారు. అయినా, స్వామివారిని దర్శించుకోవడానికి మరోసారి తప్పక వస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో దేవస్థానం ఉపప్రధాన అర్చకుడు నంబి శ్రీనివాసచారి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకుడు నంబి నర్సింహమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి



జగిత్యాలటౌన్: మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయిపడిన బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకురాలు ఇందూరి సులోచన డిమాండ్ చేశారు. కొన్నినెలలుగా బిల్లులు విడుదల కావడం లేదంటూ విధులు బహిష్కరించిన కార్మికులు.. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. సులోచన మాట్లాడుతూ, మెస్, కోడిగుడ్ల బిల్లులు కొన్ని నెలలుగా విడుదల కావడం లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వంటలు మానేసిన కార్మికులు.. సమ్మెబాట పట్టారని ఆమె తెలిపారు. కక్షగట్టిన ప్రభుత్వం.. వంట కార్మికులను విధుల్లోంచి తొలగించే చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ చర్యలు మానుకోవాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, నియామక పత్రాలు అందజేయాలని కోరారు. కేరళ ప్రభుత్వం తరహాలోనే కనీస వేతనం రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తొలిశత్రువులు కాంగ్రెస్, బీజేపీలే..



ధర్మపురిలో నిరసన తెలుపుతున్న ఎంపీ వెంకటేశ్‌నేత తదితరులు



జగిత్యాల తహసీల్ చౌరస్తాలో బైఠాయించిన బీఆర్ఎస్ శ్రేణులు

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

జగిత్యాలటౌన్: రైతులకు తొలి శత్రువులు కాంగ్రెస్, బీజేపీ నాయకులేనని జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.చంద్రశేఖర్‌గౌడ్ విమర్శించారు. ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక తహసీల్ చౌరస్తాలో బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. వసంత, చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి మూడు గంటల కరెంట్ సరిపోతుందన్న రేవంత్ వ్యాఖ్యలు సరికాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రైతులను గోస పెట్టాలని చూస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, రూరల్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్, నాయకులు దావ సురేశ్, ఆనంద్‌రావు, కత్రోజు గిరి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకి..

కోరుట్ల: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకి అని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు విమర్శించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సుదవేణి భూమయ్య, జక్కని గణేశ్, సంగెం సర్పంచ్ చెప్యాల నర్సయ్య తదితరులు ఉన్నారు.

'ఆయన చంద్రబాబు ఏజెంట్..'

ధర్మపురి: అధికారం కోసం తపిస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయ రంగానికి మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తే సరిపోతుందని కక్షపూరితంగా వ్యాఖ్యలు చేశారని, ఇవి రైతు వ్యతిరేక వ్యాఖ్యలని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, టీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు మొగిలి శేఖర్, ఆకుల రాజేశ్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు అక్కెనపెల్లి సునిల్‌కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతు పక్షపాతి

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- బీఆర్ఎస్ తీరుపై నిరసనలు



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మతో శవయాత్ర

జగిత్యాలటౌన్: వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా, రాయితీ విత్తనాలు, పనిముట్లు, పంటలకు మద్దతు ధర కల్పించడం, ఏకమొత్తంలో రూ.లక్ష రుణమాఫీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ వ్యాఖ్యలను వక్రీకరిస్తూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. స్థానిక ఇందిరాభవన్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు యాత్ర కొనసాగింది. లక్ష్మణ్‌కుమార్, విజయలక్ష్మి మాట్లాడుతూ ఉచిత కరెంట్ పేరుతో ప్రభుత్వం రూ.60వేల కోట్ల అప్పు చేసిందన్నారు. కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్షను భగ్నం చేసేందుకు ఉద్దేశపూర్వకంగా రేవంత్ వ్యాఖ్యలను వక్రీకరించిన బీఆర్ఎస్ నాయకులు.. ఆందోళనల పేరిట రైతులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. గతఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన హామీ రూ.లక్ష రుణమాఫీకి ఎగనామం పెట్టి రైతులను మోసం చేశారని ధ్వజమెత్తారు. రూ.1.50లక్షల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో అదనంగా ఒక్కఎకరాకు సైతం నీళ్లు రాలేదని, కేవలం కేసీఆర్ కుటుంబమే లాభపడిందని వారు ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, గాజంగి నందయ్య, పుప్పాల అశోక్, నక్క జీవన్, నేహాల్, గుండ మధు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బద్నాం చేయడానికే..

ధర్మపురి: కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయడానికి బీఆర్ఎస్ నాయకులు కుట్ర పన్నారని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అడ్లూరి మాట్లాడుతూ, బీఆర్ఎస్ నాయకులు ధర్మపురిలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తుంటే పోలీసులు మౌనంగా ఉన్నారని, కాంగ్రెస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కాగా, సీఎం దిష్టిబొమ్మ దహనం చేయడానికి వెళ్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. నాయకులు దినేశ్, వేముల రాజేశ్, కుంట సుధాకర్, సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ తదితరులున్నారు.

వైభవంగా మడేలేశ్వరస్వామి బోనాలు



జగిత్యాలటౌన్: రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో శ్రీమడేలేశ్వరస్వామి, వీరమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, బల్దియా చైర్మన్ గోళ శ్రీనివాస్‌తోపాటు రజక సంఘం మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



బోనాల ఊరేగింపులో బీజేపీ నేత భోగ శ్రావణి, ఎమ్మెల్యే సంజయ్, వసంత తదితరులు

ప్రతీ కేసులో నాణ్యమైన విచారణ

- ఎస్పీ భాస్కర్ ● మల్యాల పోలీస్ సర్కిల్ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

మల్యాల(చొప్పదండి): ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలని, పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని ఎస్పీ భాస్కర్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం మల్యాల సర్కిల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించారు. సర్కిల్ పరిధిలో నమోదవుతున్న గ్రేవ్ కేసుల వివరాలు, శాంతిభద్రతల నిర్వహణ తదితర అంశాలపై ఎస్పీ భాస్కర్ ఆరా తీశారు. సర్కిల్ పరిధిలోని మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి మండలాల్లో ఎన్ని కేసులు నమోదవుతున్నాయి? ఎన్ని కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి? ఎలాంటి నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి? ఏయే ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి? తదితర అంశాలను సీఐ కోటేశ్వర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో 5ఎస్ అమలు తీరు, పిటిషన్ ఫైల్‌లోఎంక్వైరీ రిపోర్టులను పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్క నాటారు. ప్రతీ సీడీ ఫైల్‌లో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రకాశ్, మల్యాల సీఐ బి.కోటేశ్వర్, ఎస్సైలు అశోక్, సతీశ్, వెంకట్రావు, కుమారస్వామి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేలం రద్దు



కల్యాణకట్టలో తలనీలాలు తీస్తున్న నాయీ బ్రహ్మణులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయ స్వామివారి ఆలయానికి సంబంధించి తలనీలాలు పోగు చేసుకునే వేలానికి బుధవారం చివరి రోజు కాగా ఎలాంటి డీడీలు రాలేదని కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస శర్మ, టెండర్ల ఇన్‌చార్జి శ్రీనివాస చారి తెలిపారు. వచ్చే సంవత్సరం జనవరి 1నుంచి జూలై వరకు సంబంధించి ఈనెల 14న వేలం నిర్వహించనున్నట్లు అధికారులు తెలపగా టెండర్‌దారుల నుంచి డీడీలు రాలేదని, రద్దుచేసి తిరిగి మళ్లీ నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు.

సాయి హుండీ ఆదాయం రూ.4.86 లక్షలు

కోరుట్ల: పట్టణ శివారులోని సాయిబాబా ఆలయ హుండీ ఆదాయం రూ.4,86,280 సమకూరినట్లు ఆలయ అధ్యక్షుడు చిదురాల భూమయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలోని హుండీని లయ మండపంలో తెరిచి లెక్కించగా నగదుతోపాటు బంగారం, వెండి మిశ్రమ బంగారం లభించిందన్నారు. కంసాలి లేక పోవటంతో బంగారం, వెండి మిశ్రమాన్ని తిరిగి హుండీలో వేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ పర్యవేక్షకుడు రవికిషన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో రెండోదశ ప్రవేశాలు

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో రెండోదశ ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ఐటీఐ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఆగస్టు – 2023 సెషన్ కోసం ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్‌లలో శిక్షణ పొందేందుకు అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగలవారు iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 12నుంచి 31వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తొలిదశలో దరఖాస్తు చేసి, సీట్లు రానివారు కేవలం వెబ్ ఆప్షన్లు ఇస్తే సరిపోతుందని ఆయన తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలి

జగిత్యాల: క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీ చేయాలని క్రీడల అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ సూచించారు. బుధవారం స్థానిక మినీస్టేడియంలో జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదో తరగతిలో 32 మంది బాలురు, 23 మంది బాలికలు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో 10 మంది బాలురు, 10 బాలికలు ఈనెల 25న జరిగే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు ఎంపికయ్యారని వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలో బుధవారం తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి సీతారామాచార్యులు ఇంటికి తాళం వేసి నెల రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం సాయంత్రం ఇంటి గేటు, తలుపులు తీసి ఉండడం గమనించిన స్థానికులు వెళ్లి చూడగా.. ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. బీరువా, ఇంటితాళాలు పగులగొట్టి ఉండడం తోపాటు ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

తగ్గుతున్న పాల ఉత్పత్తి

- ఒకప్పుడు గ్రామాల్లో ఇంటింటా పాడి పశువులు
- పోషణ భారంతో విక్రయిస్తున్న రైతులు
- గ్రామాల్లోనూ పాలప్యాకెట్ల విక్రయించే పరిస్థితి
- పెరుగుతున్న రేట్లతో వినియోగదారుల ఇబ్బందులు



పాలు పితుకుతున్న మహిళా రైతు

జగిత్యాలఅగ్రికల్చర్: ఒకప్పుడు గ్రామాల్లో ఎటుచూసినా పాడి పశువులే కనిపించేవి. ఊరంతా రైతుల ఇళ్లలో పాల నురగలు కనిపించేవి. మారుతున్న కాలానుగుణంగా పోషణ భారంతో పాడి పశువులు తగ్గుతుంటే, ఆ మేరకు పాల ఉత్పత్తి సామర్థ్యం పడిపోతోంది. దీంతో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు సరిపడా పాల ఉత్పత్తి సామర్థ్యం జరగడం లేదు. చివరకు గ్రామాల్లో సైతం పాలప్యాకెట్లు విక్రయించే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 46,636 పాడి పశువులు..

జిల్లాలో మొత్తం పశువులు 1,34,614 ఉండగా, అందులో పాలు ఇచ్చే పశువులు 46,636 మాత్రమే ఉన్నాయి. ఆవులు 8,875 ఉండగా, బర్రెలు (గేదెలు) 37,761 ఉన్నాయి. పాలిచ్చే దేశీ ఆవులు 7,394 ఉండగా, విదేశీ జాతి ఆవులు 1,481 ఉన్నాయి. దేశీ గేదెలు 32,552, విదేశీ గేదెలు 5,209 ఉన్నాయి. వి దేశీ బర్రెలు, విదేశీ ఆవులను ఎక్కువగా డెయిరీ ఫారాల్లో వ్యాపారపరంగా పెంచుతున్నారు. జిల్లాలో డెయిరీ ఫారాల సంఖ్య అంతా ఆశించిన స్థాయిలో లే దు. డెయిరీ ఫారాల ద్వారా పాడి పశువుల సంఖ్య బట్టి రోజుకు 100 లీటర్ల వరకు పాలఉత్పత్తి జరుగుతుండగా, గ్రామాల్లో ఒక్కటి, రెండు దేశీ ఆవులను, బర్రెలను పెంచే రైతులు 100 లీటర్ల వరకు పాలను ఉత్పత్తి చేయలేకపోతుండటం ఆందోళన కలిగిస్తుంది.

గేదెల పెంపకం నుంచి తప్పుకుంటున్న రైతులు..

ఒకప్పుడు గ్రామాల్లో ప్రతి రైతుకూ ఒకటి, రెండు గేదెలు ఉండేవి. పాడి గేదెల ద్వారా ప్రతి ఇంట్లో రోజుకూ 3–4 లీటర్ల పాల ఉత్పత్తి జరిగేది. పట్టణాలకు దగ్గరగా ఉన్న రైతులు పాలను నేరుగా వినియోగదారులకు విక్రయిస్తూ, కొంతమేర లాభం పొందుతున్నారు. పట్టణాలకు దూరంగా ఉన్న రైతులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పాల ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా ప్రైవేట్ పాల కంపెనీలకు పాలు పోస్తున్నారు. అయితే, వర్షాకాలం నుంచి శీతాకాలం మధ్యలో కొంతమేర పాల దిగుబడి ఉన్నా వేసవి వచ్చే వరకు పాల దిగుబడి పడిపోతుంది.

రోజుకూ పాల దిగుబడి 1.05 లక్షల లీటర్లు

జిల్లాలో రోజుకూ పాల దిగుబడి లక్ష లీటర్ల వరకు ఉంటుందని అంచనా. పాల శీతలీకరణ కేంద్రాలు నాలుగు ఉండగా, మిల్క్ సేకరణ సెంటర్లు 223 వరకు ఉన్నాయి. కంపెనీలు పాలలోని వెన్నశాతం బట్టి రేటు కల్పిస్తుండటంతో రైతులకు పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. సగటున ప్రతి గ్రామంలో 8–9 శాతం మధ్యనే ఫ్యాట్ రావడంతో, లీటర్‌కు రూ 60–65 మాత్రమే రేటు వస్తుంది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రకటించిన ఇన్సెంటివ్స్ కూడా సరిగా రావడం లేదు.

పెరుగుతున్న పెట్టుబడి

పాడి పశువులకు పచ్చిమేత, దాణా తప్పనిసరి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో పచ్చిమేతను కోసుకువచ్చి వేసే పరిస్థితి లేదు. దాణాకు తవుడు 50 కిలోలకు రూ. 1400 వరకు చేరింది. ఎండుగడ్డిని కట్టలు కట్టించి, ఇంటికి తీసుకవస్తే, ఒక్కో కట్టకు రూ.80–90 వరకు ఖర్చు వస్తుంది. గ్రామాల్లో పశువుల మందను కాసేవారు లేకపోగా కాసినా కూలీ ఖర్చు పాల ఖర్చును మించిపోయింది. పాలను ఉత్పత్తి చేసే బదులు పాల ప్యాకెట్‌ను కొనుక్కుంటే సరిపోతుందనే అభిప్రాయానికి రైతులు వచ్చారు. దీంతో, పాల ఉత్పత్తి తగ్గిపోవడంతో, కంపెనీలు కూడా రేట్లు పెంచాయి. పెంచిన రేట్లు వినియోగదారులకు ఇబ్బందిగా మారాయి.

ఆసక్తి కనబర్చని యువత



యువత పాడి పశువుల వైపు పెద్దగా దృష్టి సారించడం లేదు. వృద్ధులకు చేత కావడం లేదు. దీంతో ఒకటి రెండు బర్రెలతో వచ్చే ఆదాయం తక్కువ, వాటికి పెట్టుబడి ఎక్కువ కావడంతో పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

– గడ్డం గంగారెడ్డి, పాడి రైతు, చల్‌గల్

డెయిరీ ఫారాల వైపు ప్రోత్సహిస్తున్నాం



అభ్యుదయ రైతులను డెయిరీ ఫారాల వైపు ప్రోత్సహిస్తున్నాం. పాడి పశువులకు కృత్రిమ గర్భోత్పత్తి వంటి కార్యక్రమాల ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నాం. పాడి పశువులకు ఎలాంటి వ్యాధిసోకినా వెంటనే సిబ్బంది స్పందిస్తున్నారు. పాడి పశువులతో పాటు పాల దిగుబడి తగ్గకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం.

– గోపాల కృష్ణమూర్తి, జిల్లా పశువైద్యాధికారి, జగిత్యాల

ఎమ్మెల్యే సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందజేత



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వంశీధర్

జగిత్యాలక్రైం: జిల్లా రవాణా శాఖ అధికారిగా నియమితులైన జి.వంశీధర్ బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా రవాణా శాఖ అధికారిగా పనిచేసిన అజ్మీరా శ్యామ్‌నాయక్ ఉద్యోగానికి రాజీనామా చేయగా జిల్లా రవాణా శాఖ అధికారిగా వంశీధర్ నియమించారు.

ఎల్.రమణకు మంత్రి పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

జగిత్యాల: ఎమ్మెల్సీ ఎల్.రమణ తండ్రి ఎల్లీరామ్ అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ వెంకటేశ్ నేత పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్

- మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్: విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఎల్ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇంపాక్ట్ స్టూడెంట్ మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్, మేధా సంస్థల చైర్మన్, ప్రముఖ స్పోకెన్ ఇంగ్లిష్ నిపుణుడు మేధా చిరంజీవి, పోతనా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ముర్రు ముత్యాల నాయుడు, స్మార్టా ట్రస్ట్ నిర్వాహకులు అద్దంకి శరత్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలన్నారు. నైనా జైస్వాల్ మాట్లాడుతూ... విద్యార్థులు ఇష్టంగా చదివితే ఉన్నత లక్ష్యాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఎల్ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ కొప్పుల స్నేహలత, ఎస్పీ ఎగ్గడి భాస్కర్, మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

జగిత్యాల: విద్యార్థి, బీసీ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా పాఠశాలల బంద్ ప్రశాంతంగా జరిగింది. విద్యారంగంలో సమస్యలు అనేకంగా ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం పాఠశాలలు, కళాశాలల బంద్‌కు బుధవారం పిలుపు ఇచ్చాయి. కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు తెరువగా నాయకులు దగ్గరుండి వాటిని మూసివేయించారు. వారు మాట్లాడుతూ, విద్యారంగంలో ఎన్నో సమస్యలు నెలకొన్నాయని, ప్రభుత్వం ఇప్పటికైనా నిర్లక్ష్య ధోరణి విడనాడి పరిష్కరించాలన్నారు. నాయకులు లక్ష్మీనారాయణ, చింతల గంగాధర్, అక్రమ్, వినోద్, వంశీ, సోహెల్, రంజిత్, రమేశ్, మనీష, సుష్మస్వరాజ్, పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

ధర్మపురి: విద్యారంగ సమస్యల పరిష్కారరం కోసం చేపట్టిన బంద్ ధర్మపురిలో విద్యా సంస్థల బంద్ విజయవంతమైందని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేశ్ తెలిపాడు.

జగిత్యాలలో వర్షం

జగిత్యాల: జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. ఈ వర్షాకాలంలో ఇప్పటివరకు ఆశించినస్థాయిలో వర్షం కురువలేదు. దీంతో పంటలు ఎలా పండించేదని రైతులు ఆవేదనలో ఉన్నారు. వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. తేలికపాటిగా కురుస్తున్నా.. నేల తడవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం కొద్దిపాటి వర్షం కురవడంతో హర్షంవ్యక్తం చేస్తున్నారు.

పరిష్కారం కాని భూవివాదం

- కేసు నమోదు చేసిన పోలీసులు
- ఏళ్లుగా నానుతున్న సమస్య
- పరిష్కరించని రెవెన్యూ అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని హరిదాస్‌నగర్ శివారులో సర్వేనంబర్ 385/14లో రెండెకరాల భూమిపై వివాదం కొనసాగుతోంది. హరిదాస్‌నగర్‌కు చెందిన అన్నదమ్ములు ఉప్పుల మల్లయ్య, ఉప్పుల ఎల్లయ్య ఆ భూమిలో కొన్నాళ్లుగా సాగుచేసుకుంటున్నారు. ఇటీవల ఉప్పుల ఎల్లయ్య కొడుకు రవి అదే సర్వేనంబర్‌లోని 20 గుంటల స్థలాన్ని అతని భార్య లత పేరిట 2013లో లావణి పట్టా చేయించుకున్నాడు. అప్పటి నుంచి మల్లయ్య, ఎల్లయ్య కుటుంబాల మధ్య వివాదం నడుస్తోంది. మల్లయ్య కుటుంబ సభ్యులు తనను బెదిరించారని రవి ఫిర్యాదుతో పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఈ విషయమై ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ జయంత్‌కుమారును వివరణ కోరగా.. అది ప్రభుత్వ భూమి అని.. సర్వే పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామన్నారు.

బువ్వ పెడుతలేరని..

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధుడు
- భోజనం అందించి మానవత్వం చాటుకున్న పోలీసులు



పోలీస్‌స్టేషన్‌లో మల్లయ్య

జగిత్యాలక్రైం: ఇద్దరు కుమారులు, ఆస్తిపాస్తులున్నా తనను చేరదీయడం లేదని, ఐదారు రోజులుగా భోజనం పెట్టడం లేదంటూ ఓ వృద్ధుడు బుధవారం ఠాణాను ఆశ్రయించాడు. జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన సంబు అలియాస్ గుండంపల్లి మల్లయ్య (80)కు ఇద్దరు కుమారులు. రెండెకరాల భూమి ఉంది. కొద్ది రోజులుగా మల్లయ్య ఇద్దరు కొడుకులు తనకు అన్నం పెట్టడం లేదని, ఐదు రోజులుగా పస్తులున్నానంటూ బుధవారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు తెలిపాడు. పోలీసులు వృద్ధుడికి భోజనం తెప్పించి మానవత్వం చాటుకున్నారు. మల్లయ్య కుమారులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

బీజేపీ నాయకుడికి గాయాలు

ముస్తాబాద్: ముస్తాబాద్, రాళ్లపేట రహదారి నిర్మాణంలో ఉండగా సీసీరోడ్డుపై బీజేపీ నాయకుడు కామిటికార్ హరిబాబు గాయపడ్డాడు. రహదారి పనుల్లో ఇంటిముందు అరుగులు తీసివేయగా, ఇంట్లోంచి కిందికి దిగుతున్న హరిబాబు కిందపడ్డాడు. ఎడమ కాలుకు గాయంకాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రహదారి పనులు పూర్తిచేసి, ప్రమాదాలు జరగకుండా చూడాలని అధికారులను కోరాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రాకేశ్ (ఫైల్)

రాయికల్ : మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన పిట్టల రాకేశ్ (31) అనే రైతు విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రాకేశ్‌కు గ్రామంలో ఎకరంన్నర పొలం ఉండగా సాయంత్రం నారుమడికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. వ్యవసాయ బావివద్ద ఉన్న స్టార్టర్‌ను ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉంది.

యువతి అదృశ్యం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి (19) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. స్టేషన్‌హౌజ్ అధికారి గజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు యువతి బుధవారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో యువతి తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

యువతతో ఏదైనా సాధ్యమే

- అడిషనల్ కలెక్టర్ మకరంద్

జగిత్యాల: యువత తలచుకుంటే ఏదైనా సాధ్యమేనని అడిషనల్ కలెక్టర్ మకరంద్ అన్నారు. బుధవారం నెహ్రూ యువ కేంద్రం జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక మినీ స్టేడియంలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్య్రం సాధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచంలోనే మనది భిన్నత్వంలో ఏకత్వం గల భారతదేశమన్నారు. నేటి యువకులకు మంచి విద్యతోపాటు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీతం ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో గెలుపొందిన వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి వెంకట్ రాంబాబు, ప్రోగ్రాం అధికారి రవీందర్, ఎన్‌సీసీ కేడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మద్యంతాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమని ఎస్సై ప్రేమ్‌దీప్ అన్నారు. మండలంలోని రాగట్లపల్లి, దుమాల గ్రామ శివారుల్లో పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన వాహనపత్రాలు లేని 20 వాహనాలకు జరిమానా విధించారు. మద్యంతాగి వాహనాలు నడిపిన ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రేమ్‌దీప్ మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రయాణిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. వారం రోజుల్లో 45 వాహనాలకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

మక్కసాగు వైపు రైతుల మొగ్గు

- 60వేల ఎకరాల్లో పండిస్తారని అంచనా
- కలిసి వస్తున్న మద్దతు ధర



జగిత్యాల పట్టణ శివారులో సాగవుతున్న మొక్కజొన్న

జగిత్యాలఅగ్రికల్చర్: ఈ వానాకాలం సీజన్‌లో పంటల సాగుపై ప్రభుత్వం ఆంక్షలు విధించలేదు. దీంతో రైతులు తమకు నచ్చిన పంటలు సాగు చేసుకుంటున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా చాలామంది గతంలో మాదిరిగానే మొక్కజొన్న వైపు మొగ్గుచూపుతున్నారు. తద్వారా జిల్లాలో సాగు విస్తీర్ణం బాగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. పసుపులో అంతరపంటగా కొందరు, ప్రత్యేకంగా మక్క పండించేందుకు మరికొందరు సన్నాహాలు చేస్తున్నారు.

సాగు విస్తీర్ణం 60 వేల ఎకరాలు..

జిల్లాలో ఎర్ర నేలలు బాగా ఉన్నాయి. సాగునీటి వసతులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి.

- దీంతో ఈసారి దాదాపు 60 వేల ఎకరాల్లో విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేసే అవకాశం ఉంది.
- ప్రధానంగా చాలామంది హైబ్రిడ్ విత్తనాలు వినియోగిస్తున్నారు.
- తద్వారా ఎకరాకి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది.
- దీనికితోడు, ప్రభుత్వ మద్దతు ధర మొన్నటివరకు క్వింటాల్‌కు రూ.1,962 ఉండగా, తాజాగా రూ.128 పెంచింది. దీంతో క్వింటాల్ మద్దతు ధర రూ.2,090కి చేరింది.
- బహిరంగ మార్కెట్‌లో ఆశించిన ధర లభించకుంటే.. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసే వెసులుబాటు ఉంది.
- ఇది రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండడంతో చాలామంది మొక్కజొన్న వైపు దృష్టి సారిస్తున్నారు.
- గత రెండు సీజన్లలో మద్దతు ధరను మించి బహిరంగ మార్కెట్లో క్వింటాల్‌కు రూ.3,000 వరకు ధర పలికింది.

సమస్యలను అధిగమిస్తూ..

జిల్లాలో ఎక్కువగా అటవీ ప్రాంతం ఉంది. దీంతో మొక్కజొన్న పీచుదశ నుంచి గింజదశకు వచ్చేవరకు కోతులు, అడవిపందులు, రామచిలుకలు పంటకు నష్టం చేస్తున్నాయి. అయితే, మక్కలకు డిమాండ్ ఉండటం, మిగతా వాటికి పెద్దగా ధరలు లేకపోవడంతో రైతులు అనేక కష్టనష్టాలకు ఓర్చి మక్క సాగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పంట కాలం మూడు నెలలు కాగా, కనీసం నెల పాటు కాపాలాగా వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. తోటకు కాపాలా వెళ్లే అవకాశం లేనప్పుడు, పచ్చికంకిగా విక్రయించేందుకూ కూడా వెనుకాడడంలేదు.

విత్తనాలలకు అధిక ఖర్చు..

- ప్రస్తుతం మక్క సాగులో రైతులు ఎక్కువగా హైబ్రిడ్ విత్తనాలు వాడుతున్నారు.
- వాటిని ఉత్పత్తి చేసే కంపెనీలు నాలుగైదు కిలోల బ్యాగ్‌కే రూ.1,000– రూ.1,500 వరకు వసూలు చేస్తున్నాయి.
- విత్తనం వేసేముందు నేలతో డీఏపీతో పాటు మోకాలి ఎత్తు దశలో, పీచు దశలో యూరియా, కాంప్లెక్స్ వంటి రసాయన ఎరువులు వేస్తుంటారు.
- వీటి ధరలు కూడా రోజురోజుకూ పెరుగుతున్నాయి.
- అయితే, దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఈ పంట వైపే దృష్టి పెడుతున్నారు.
- కంకి తీసుకున్న తర్వాత కర్రలను పశుగ్రాసంగా ఉపయోగిస్తున్నారు.
- దీంతో మార్కెట్లో చొప్పకు మంచి డిమాండ్ పలుకుతోంది.
- ఒక్కో ట్రాక్టర్ లోడ్ మక్కచొప్పకు కనీసం రూ.4 వేల వరకు ధర పలుకుతోంది.
- కర్రలు పూర్తిగా ఎండిన తర్వాత నేలలో కలియదున్నితేసేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతోంది.
- దీంతోనే రైతులు మక్క సాగుపై మమకారం పెంచుకుంటున్నారు.

ఏటా మక్క పండిస్త



ప్రతి ఏటా మొక్కజొన్నను రెండు ఎకరాల్లో సాగు చేస్తాను. మొక్కజోన్నకు పెద్దగా పని లేకపోవడం, కేవలం గింజ దశలో ఉదయం, సాయంత్రం కాపాలాగా వెళ్లితే సరిపోతుంది. మిగతా పంటలకు పెద్దగా ధరలు లేకపోవడంతో, కష్టమైనప్పటికి మొక్కజొన్న ద్వారానే ఎంతో, కొంత అదాయం వచ్చే అవకాశం ఉంది.

– మర్రిపెల్లి శ్రీనివాస్, రైతు, ముత్యంపేట, మల్లాపూర్

సాగు విస్తీర్ణం పెరుగుతుంది



జిల్లాలో ఈసారి మొక్కజొన్న సాగు గణనీయంగా పెరుగుతుంది. పసుపులో అంతరపంటగా కొందరు పండిస్తారు. మరికొందరు విడిగానే మక్క పండించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జిల్లాలోని పలువురు రైతులు అన్నియాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి